క్లుప్తంగా

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

రాయచోటి టౌన్ : పట్టణంలోని ప్రధాన కూడళ్లతోపాటు రింగ్ రోడ్డు, పట్టణ శివార్లలో పోలీసులు ముమ్మరంగా వాహనాలను తనిఖీ నిర్వహించారు. వాహనాలలో తీసుకెళుతున్న వస్తువులను పరిశీలించారు. తనిఖీల్లో గురువారం అర్బన్ సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్ఐ భక్తవత్సలం పాల్గొన్నారు. వాహనదారులకు సూచనలు, సలహాలు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున డబ్బులు రూ.50 వేలకు మించి తీసుకెళ్లకూడదని, ఒక వేళ ఎక్కువ తీసుకెళితే సంబంధిత అధికారుల అంగీకార పత్రాన్ని వెంట ఉండాలని చెప్పారు.

నివాళి



లీలమ్మ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి

పుల్లంపేట : జేఏసీ మండల కన్వీనర్ హరినాథరెడ్డి తల్లి నాగిరెడ్డి లీలమ్మ (60) బుధవారం మృతి చెందారు. గురువారం రైల్వేకోడూరు నియోజకవర్గ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి మృతదేహం వద్ద ఘనంగా నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి, చిట్వేలి మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, రైల్వేకోడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, యువ నాయకులు ముద్దా రామసుబ్బారెడ్డిలు లీలమ్మ మృతదేహం వద్ద నివాళి అర్పించారు.

స్విమ్మింగ్‌పూల్ ప్రారంభం

సిద్దవటం : మండలంలోని బండికనుమ వద్ద నిర్మించిన స్విమ్మింగ్ పూల్‌ను గురువారం జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీకాంత్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి పల్లె సుబ్బరామిరెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి వలీ చాన్, గోపాలస్వామి, శివరామిరెడ్డి, కె.వి.సుబ్బయ్య, యానాదిరెడ్డి, మేకల క్రిష్ణరెడ్డి, నాగరాజుశర్మ, రమణ, స్థానికులు పాల్గొన్నారు.

సంబేపల్లెలో పోలీసుల కవాతు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సంబేపల్లె : మండలంలోని పలు గ్రామాలలో పోలీసులు, పారా మిలిటరీ బలగాలు గురువారం ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. గుట్టపల్లె, పెద్దబిడికి, శెట్టిపల్లె, పెద్దజంగంపల్లె, మోటకట్ల, దేవపట్ల, తదితర గ్రామాలలో కవాతు నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ అందరూ సహకరించాలని పోలీసులు కోరారు. ఎవరైనా ఘర్షణలకు, గొడవలకు దిగితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఉపాధి హామీ పనులు తనిఖీ



పనులను పరిశీలించిన ఏపీఓ సురేంద్రనాథరెడ్డి

రామాపురం : మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఏపీఓ సురేంద్రనాథరెడ్డి పరిశీలించారు. మాట్లాడుతూ ఉపాధి పనులు డంపింగ్ యార్డు, చెరువుల్లో పూడికతీత పనులు చేస్తున్నారని, కూలీల హాజరు, పలు రికార్డులను పరిశీలించారు. కూలీలు దిన కూలీ కనీసం రూ.272లు పనులు చేయాలన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలు ఉదయం 5.30 గంటల నుంచి 10.30 గంటల వరకు పనులు చేయాలన్నారు. తనిఖీలో ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు ఉన్నారు.

నరసింహస్వామికి అభిషేకం

పెద్దతిప్పసముద్రం : నరసింహస్వామి జన్మ నక్షత్రం సందర్భంగా మండలంలోని కందుకూరులోని ఆలయంలో స్వామికి అభిషేకాలు నిర్వహించారు. పీటీఎంకు చెందిన పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో స్వామిని పుష్పాలతో అలంకరించి పూజలు నిర్వహించారు.

30న గంగమ్మ జాతర

మదనపల్లె సిటీ : కనుమలో ఈ నెల 30న రాత్రి గంగమ్మ జాతరను పురస్కరించుకుని ఆలయం సుందరంగా ముస్తాబు చేశారు. రంగు రంగుల విద్యుద్దీపాలతో ఆలయాన్ని అలకరించారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి, ఎండల నుంచి రక్షణకు చలువ పందిళ్లు వేశారు. శనివారం రాత్రి, ఆదివారం తిరుణాల నిర్వహణకు దేవాదాయశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది.

వైభవంగా నడివీధి గంగమ్మ జాతర

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ రాజంపేట అసెంబ్లీ అభ్యర్థి ఆకేపాటి, కడప మేయర్ సురేష్ బాబు

సిద్దవటం : మాధవరం గ్రామంలో వెలసిన నడివీధి గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. గురువారం జాతరలో భాగంగా అమ్మవారికి విశేష పూజలు జరిపారు. అమ్మవారి మూలవిరాట్టుకు అభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన, కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలను చేశారు. అంతేగాకుండా కొందరు భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. మరికొందరు అమ్మవారికి బలులర్పించి మొక్కుబడులను చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా రాజంపేట నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు వేర్వేరుగా గంగమ్మను దర్శించుకొని పూజలు చేయించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం వారు స్థానిక వైఎస్ఆర్‌సీపీ నాయకుడు, సర్పంచ్ చేపూరి ఓబయ్య ఇచ్చిన విందులో పాల్గొన్నారు. వీరి వెంట టీటీడీ బోర్డు సభ్యుడు యానాదయ్య, ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, మాధవరం-1 సర్పంచ్ జానకిరామయ్య, వైఎస్ఆర్‌సీపీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి పల్లె సుబ్బరామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, పార్టీ నాయకులు కె.వి.సుబ్బయ్య, మేకపాటి సుబ్బారెడ్డి, మేరువ ప్రసాద్, గోపాలస్వామి, కె.వి.సబ్బారెడ్డి, మాచనూరు సుబ్బారెడ్డి, దిలీప్, నాగరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పూజలందుకున్న నడివీధి గంగమ్మ



పూజల్లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ అమర్‌నాథరెడ్డి



మొక్కులు చెల్లించుకుంటున్న కడప మేయర్ సురేష్‌బాబు

గుండెపోటుతో కౌన్సిలర్ మృతి

ఆత్మీయుడిని కోల్పోయానంటూ కంటతడిపెట్టిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



ఆసిఫ్ అలీఖాన్ (ఫైల్)

రాయచోటి అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డు వైఎస్ఆర్‌సీపీ కౌన్సిలర్ ఆసిఫ్ అలీఖాన్ గురువారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందారు. ఆసిఫ్‌అలీఖాన్ దివంగత వైఎస్ఆర్‌సీపీ నేత అఫ్జల్ అలీఖాన్‌కు సోదరుడు. ప్రస్తుత శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానంకు మరిది. కాగా కౌన్సిలర్ మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి హుటాహుటిన ఆయన ఇంటికి చేరుకొని ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆసిఫ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని మంచి ఆత్మీయుడిని కోల్పోయానంటూ ఎమ్మెల్యే కంటతడి పెట్టారు. ఆసిఫ్‌అలీఖాన్ మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్ బాషా, ఏపీ స్టేట్ సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, బీసీ నేత పల్లపు రమేష్‌తోపాటు పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీనేతలు, కార్యకర్తలు, మైనార్టీలు, పుర ప్రముఖులు ఉన్నారు.



మృతదేహం వద్ద కంటతడి పెడుతున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

అన్ని వర్గాలకు ప్రాధాన్యతనివ్వాలి

రాయచోటి టౌన్ : రాజకీయ పార్టీలు అన్ని సామాజిక వర్గాల వారికి తగిన ప్రాధాన్యతనివ్వాలని రాష్ట్ర వడ్డెర యువజన పోరాట సమితి సభ్యుడు ఇడగొట్టు నాగేశ్వరావు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజకీయాల్లో కొన్ని వర్గాలకే చట్టసభల్లో అధిక స్థానాలు దక్కుతున్నాయని, చట్టసభల్లో ఇప్పటి వరకు అడుగుపెట్టని వర్గాలు అనేకం ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలు తమ విధానాలను మార్చుకోవాలని సూచించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కులాల వారీగా ఓట్లు దండుకోవడానికి అన్ని పార్టీల నాయకులు వస్తారని ప్రజలు తమకు న్యాయం చేసే నాయకుడినే ఎన్నుకోవాలని తెలియజేశారు. ఇప్పటికైనా రాజకీయ పార్టీల అధినేతలు అన్ని వర్గాలకు రాజకీయంగా చట్టసభల్లో స్థానం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ చక్రే నాయక్

లక్కిరెడ్డిపల్లె : ప్రభుత్వం అందిస్తున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యమైన భోజనాన్ని అందించాలని, వంటల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంఈఓ చక్రే నాయక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని మద్దిరేవుల పంచాయతీలోని అప్పలరాజుగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు ఉదయం పూటనే రాగి జావ అందించి మధ్యాహ్న సమయంలో ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం భోజనాన్ని విద్యార్థులకు అందించాలని మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీకి ఎంఈఓ సూచించారు. వేసవి అధికంగా ఉంటున్న నేపథ్యంలో విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శివశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా 'పీసీపీఎన్‌డీటీ' అమలు

రాయచోటి ఆర్డీఓ రంగస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రంగస్వామి

రాయచోటి అర్బన్ : పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేద్దామని రాయచోటి రెవెన్యూ డివిజనల్ అధికారి రంగస్వామి అన్నారు. గురువారం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన డివిజనల్ స్థాయి పీసీపీఎన్‌డీటీ అడ్వైజరీ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ రాయచోటి, పీలేరు పట్టణాల్లో ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేసి ఆయా కేంద్రాల వారు ప్రభుత్వ నియమ, నిబంధనలను పాటిస్తున్నారా లేదా పూర్తిస్థాయిలో పరిశీలించాలన్నారు. ముఖ్యంగా ఆసుపత్రులు, స్కానింగ్‌సెంటర్‌ల యాజమాన్యం పీసీపీఎన్‌డీటీ చట్టం నిబంధనలు పాటించేలా నోటీసులు ఇవ్వాలన్నారు. నోటీసులకు స్పందించని, లోపాలను సరిదిద్దుకోని స్కానింగ్ సెంటర్‌లను గుర్తించి వాటిని సీజ్ చేయాలంటూ అధికారులను ఆదేశించారు. స్కానింగ్ కేంద్రాలను కలిగిన ఆసుపత్రులు తప్పనిసరిగా గర్భస్రావం మందులు, సంతానోత్పత్తికి సహాయపడే మందులకు ప్రత్యేకంగా రిజిస్టర్‌ను నిర్వహించాలంటూ కోరారు. ఏ ఆసుపత్రిలో నైనా లింగనిర్ధారణ చేసినట్లు తెలిస్తే యాజమాన్యానికి పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం 3 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేల జరిమానాతోపాటు ఆసుపత్రిని సీజ్ చేస్తామంటూ ఆర్డీఓ హెచ్చరించారు. కార్యక్రమంలో పీసీపీఎన్‌డీటీ నోడల్ అధికారిణి ఉషశ్రీతోపాటు కమిటీ సభ్యులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనానికి విరాళం అందజేత



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మల్లాలమ్మ దిన్నె పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వసతిగాను నల్లపరెడ్డిపల్లె పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న బాబా రజాక్ రూ.5వేలు విరాళాన్ని అందించారు. గురువారం విరాళాన్ని ఎంఈఓ ఆధ్వర్యంలో పాఠశాల సిబ్బందికి అందజేశారు. కాగా గ్రామానికి పాఠశాల నూతనంగా మంజూరు కావడంతో యుడైస్ కోడ్ మంజూరు కానందున మధ్యాహ్న భోజన పథకం మంజూరు కాలేదని సీఆర్‌పీ బాద్‌షా తెలిపారు.

ప్రతి ఓటరు తన హక్కుని వినియోగించాలి

ఒంటిమిట్ట : ప్రతి ఓటరు తన హక్కుని వినియోగించాలని తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. గురువారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మోడల్ పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశారు. తహసీల్దార్, ఎంపీడీఓ రామచంద్ర, బూత్ లెవల్ అధికారులు స్వయంగా ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో రాజంపేట నియోజకవర్గ నోడల్ అధికారి డి.శ్రీనివాసులు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావాలని, ప్రతి ఓటరు ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు. నూరుశాతం ఓటరు నమోదు, ఓటరు వినియోగం వల్ల పటిష్టమైన ప్రజాస్వామ్యం ఏర్పాటుకు సహకరించాలని కోరారు.



మాక్ పోలింగ్‌లో పాల్గొన్న ఓటర్లు

అన్నమాచార్య కళాశాలలో స్పోర్ట్స్ మీట్

రాజంపేట : ఏఐటీఎస్ ప్లే గ్రౌండ్‌లో అన్నమాచార్య ఫార్మసీ కళాశాల విద్యార్థులకు గురువారం స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. క్రీడల్లో యువతీయువకులు పోటాపోటీగా తమ ప్రతిభను చాటుకున్నారు. వాలీబాల్, క్రికెట్, షటిల్, త్రోబాల్, టెన్నికాయిట్, చదరంగం, క్యారమ్స్, లాంగ్‌జంప్, హైజంప్, డిస్కత్రో, షాట్‌పుట్ వంటి క్రీడల్లో పోటీలు నిర్వహించారు. పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ స్వర్ణలత మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. మానసికంగాను, శారీరకంగా బలంగా ఉండాలంటే క్రీడలు, వ్యాయామం తప్పనసరి అన్నారు. స్పోర్ట్స్ మీట్ ప్రతినిధి మధు మాట్లాడుతూ గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేస్తామని చెప్పారు.



క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకటరమణారెడ్డి



బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

మదనపల్లె సిటీ : మదనపల్లె బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో 2024-25 సంవత్సరానికి నూతన అధ్యక్షులుగా తొట్లి వెంకటరమణారెడ్డి, ఉపాధ్యక్షులుగా కాలం రఘుపతి, ప్రధాన కార్యదర్శిగా జి.బయ్యారెడ్డి,సహాయ కార్యదర్శిగా జి.ఎన్.సురేష్‌బాబు, లైబ్రరీ కార్యదర్శిగా పి.వి.ప్రసాద్, స్పోర్ట్స్, కల్చరల్ కార్యదర్శిగా బి.వేణుగోపాల్, మహిళా ప్రతినిధిగా ఎ.సుజాతలను ఎన్నుకున్నారు. ఈసీ సభ్యులుగా ఎ.శైలజ, కె.ఎం.కలీముల్లా, కలీముల్లా సయ్యద్, ఎం.లక్ష్మీకాంత్, ఎస్.ప్రవీణ్ అహ్మద్, కె.సోమశేఖర్, సి.శివశంకర్, జి.మంజునాథ్, జెఎస్.యశ్వంత్ క్రిష్ణ తదితరులు ఉన్నారు.

ధార్మికత పెంపులో గురువుల పాత్ర ప్రశంసనీయం

కడప కల్చరల్ : క్రైస్తవ విశ్వాసుల్లో ధార్మికతను పెంచేందుకు గురువులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని సెయింట్ చర్చి మాసాపేట విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ గుడిమె దేవసహాయం అన్నారు. గురువారం చర్చి ఆవరణలో ఆయన గుడ్‌ఫ్రైడే ముందస్తు కార్యక్రమాల్లో భాగంగా సంప్రదాయ సాంగ్యాలు, గురుత్వ స్థాపన, శిష్యుల పాదాలు కడగడం, కడరాత్రి భోజనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు ప్రభువు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రజలకు సేవ చేసే వారిని మంచి మార్గంలో నడిపించేందుకు గురుత్వ స్థానాన్ని నెలకొల్పారన్నారు. దీనికి గురువే నాయకుడని, ఆయనే తొలి సేవకుడిగా ఉంటారన్నారు. క్రీస్తు ప్రభువు స్వయంగా సేవకుడై శిష్యుల పాదాలను కడిగి సకల జాతి జనులకు సేవకులుగా ఉండాలని ఆజ్ఞాపించిన విషయాన్ని గుర్తు చేశారు. అందుకే క్రీస్తుకు ప్రపంచంలో ఎవరికీ లేని విధంగా లోక రక్షకుడిగా, కరుణామయుడిగా కీర్తి ఉందన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని నిస్వార్థ సేవలు అందించినపుడే గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జేఎంజే మదర్స్, చర్చి కమిటీ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



శిష్యుల పాదాలు కడుగుతున్న గురువులు

ఉజ్వల భవిష్యత్తుకు ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యండి

రాజంపేట టౌన్ : అన్ని వర్గాల ఉజ్వల భవిష్యత్తు కోసం వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్ జగన్‌ను మరోమారు సీఎం చేయాలని కాకతీయ విద్యాసంస్థల అధినేత పోలా వెంకటరమణారెడ్డి కోరారు. పట్టణంలోని 21వ వార్డులో గురువారం ఆయన విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలా వెంకటరమణారెడ్డి జగన్ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించి తద్వారా జరిగిన మేలును తెలియజేశారు. విద్యారంగానికి జగన్ పెద్దపీట వేయడం వల్ల విద్యార్థుల ఉన్నత చదువులకు బాటలు పడ్డాయని, మరోమారు జగన్ సీఎం అయితే విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జగన్ సీఎం అయ్యాక అనేక పరిశ్రమలు రాష్ట్రానికి రావడం వల్ల నిరుద్యోగులకు ఎనలేని మేలు చేకూరిందన్నారు. ప్రతి పథకం మహిళల కోసమే ప్రవేశపెట్టడం వల్ల మహిళలు పురుషులపై ఆధారపడకుండా సొంతంగా ఆర్థిక స్వావలంభన చెందుతున్నారని అందువల్ల ప్రతి మహిళా జగన్‌కు అండగా నిలవాలని కోరారు. కాగా ప్రచారానికి వచ్చి వెంకటరమణారెడ్డికి 21 వార్డు ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జెనుగు కృష్ణారావుయాదవ్, జేసీఎస్ పట్టణ ఇన్‌ఛార్జ్ వడ్డే రమణ, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు డీలర్ సుబ్బరామిరెడ్డి, కసిరెడ్డి రాజారెడ్డి, జనార్దన్‌రెడ్డి, లేతు వెంకటరెడ్డి, బాలిరెడ్డి, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పోలా వెంకటరమణారెడ్డి

అక్రమ మద్యం విక్రయాలపై ప్రత్యేక నిఘా

గాలివీడు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంటుందని మండల ఎస్ఐ వెంకట ప్రసాద్ పేర్కొన్నారు.

గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ మద్యం, నాటుసారా, కోడి పందెలు, క్రికెట్ బెట్టింగ్‌లపై ఉక్కుపాదం మోపడం జరుగుతుందన్నారు. బెల్టుషాపులు, అక్రమంగా మద్యం తరలింపు, పల్లెలో నాటుసారా తయారీ, విక్రయం తదితర కార్యకలాపాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇతర రాష్ట్రాల మద్యాన్ని మన ప్రాంతాలకు చేరకుండా గట్టి నిఘా పెట్టామని చెప్పారు. మండలంలో, గ్రామాలలో మద్యం విక్రయాలు జరుగుతుంటే సమాచారం అందించిన వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలియజేశారు. అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన వ్యక్తులను గుర్తించి, పల్లెలో ప్రశాంత వాతావరణాన్ని తీసుకురావడానికి ప్రజలు సహకరించాలని తెలిపారు. గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బైండోవర్ కేసులకు ప్రజలకు సహకరించాలని సూచించారు.



మాట్లాడుతున్న గాలివీడు ఎస్ఐ వెంకటప్రసాద్

వసతుల సద్వినియోగంతో ఉన్నతంగా ఎదగాలి

రాయచోటి టౌన్ : అందుబాటులో ఉన్న వసతులను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని డీపీఆర్ఓ భరత్‌కుమార్ అన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని మాసాపేట వద్ద ఉన్న పాలిటెక్నికల్ కళాశాలలో కళాశాల వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీపీఆర్ఓ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి పట్టణంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో చాలా అధునాతన ప్రయోగశాలలు ఉన్నాయని తెలిపారు. ఇన్ని ప్రయోగశాలలు ఉన్నందున విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకొని ఉత్తమంగా ఎదగడమే కాకుండా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపల్ శివశంకర్ మాట్లాడుతూ రాయచోటి పాలిటెక్నికల్ కళాశాలకు ఎన్‌బీఏ అక్రిడేషన్ వచ్చిందని తెలిపారు. ఇలాంటి గుర్తింపు రాయచోటి నియోజకవర్గంలో మరే కళాశాలకు లేదని చెప్పారు. 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు సద్వినియోగంచేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



వేడుకలో పాల్గొన్న డీపీఆర్ఓ, విద్యార్థులు

ఎన్నికల నిర్వహణకు సహకరించండి

రైల్వేకోడూరు : రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కోడూరు పోలీస్ సర్కిల్ పరిధిలో నిఘా వ్యవస్థను పటిష్టం చేసినట్లు సీఐ బాబు తెలిపారు. గురువారం పట్టణంలోని నరసరాంపేట తదితర ప్రాంతాలలో పోలీసులు తనిఖీలు చేసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్టేషన్ పరిధిలో సమస్యాత్మకమైన వ్యక్తులు, రౌడీషీటర్లు గుర్తించి వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహణకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు


ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

రాయచోటి టౌన్ : ఆ తండ్రి, కొడుకు(వరదప్పగారి వరదారెడ్డి, ఆయన కొడుకు వెంకటేశ్వరరెడ్డి)లను భరించలేకపోతున్నామని పీలేరు నియోజకవర్గం కలికిరి మండలం గుండ్లూరు గ్రామం అద్దవారిపల్లె గ్రామస్తులు అమర్‌నాథరెడ్డి, పర్వతరెడ్డిలతోపాటు పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రాయచోటి పట్టణంలోని ఎన్‌జీఓ హోంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మీడియాతో మాట్లాడారు. మా గ్రామంలోని వరదప్పగారి వరదారెడ్డి, ఆయన కుమారుడు వెంకటేశ్వరరెడ్డిలు ఇద్దరు తమ గ్రామంలో ఉన్న గ్రామ కంఠంతోపాటు ప్రభుత్వ భూములను ఆక్రమించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అలాగే పాఠశాల స్థలాన్ని సైతం ఆక్రమించారని చెప్పారు. ఆక్రమించిన స్థలంలో కట్టడాలు చేపట్టారని తెలిపారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులకు విన్నవించినా ఎలాంటి ప్రయోజనం లేదని వాపోయారు. తండ్రి కొడుకులు పాల్పడుతున్న ఆక్రమణలపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

వైభవంగా లక్ష్మీనరసింహుని కల్యాణం

స్వామివారి సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

పెద్దమండ్యం : మండలంలోని పాపేపల్లెలో కుషావతి నది ఒడ్డున ఏకశిలగుట్టపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం తెల్లవారు జామున స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామి వారు, శ్రీదేవి, భూదేవిలకు అభిషేకం చేసి అలంకరించారు. అనంతరం స్వామివారిక కల్యాణోత్సవం నిర్వహించారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఆయన సతీమణి కవిత ఆలయానికి రాగా స్థానిక నాయకులు, ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి నిశ్చితార్థం సందర్భంగా అర్చకుల సంభాషణ భక్తులను ఆకట్టుకుంది. భక్తులకు అన్నదానం చేశారు. కళ్యాణోత్సవం అనంతరం స్వామిని రథంపై ఊరేగించారు. చాందినీ బండ్లతో వచ్చి భక్తులు మొక్కులు తీర్చుకొన్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అంతకు ముందు ఉదయం స్వామిని పాపేపల్లె పురవీధులలో ఊరేగించగా, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక, పి.రమణ, పీరాన్‌బీ, బోడిమాని గీత, బాషా, జయరాం, గుడిసె క్రిష్టారెడ్డి, గుర్రం రమేష్, రవిచంద్ర, విష్ణుమాచార్యులు, బోడిమాని రామిరెడ్డి, గల్లా నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

మామిడికి కవరే కవచం

పీలేరు రూరల్ : మామిడి నాణ్యమైన పంట దిగుబడికి కవరే కవచమని అన్నమయ్య రైతు సహకార సంఘం అధ్యక్షుడు ఎం.జయబ్బనాయుడు పేర్కొన్నారు. తలపులలో పలు మామిడి తోటల్లో కాయలకు గురువారం కవర్లు కట్టే కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో 10 లక్షల కవర్లు పంపిణీ చేయడానికి సిద్ధం చేశామని, ఇప్పటి వరకు 3 లక్షల కవర్లు అందించినట్లు తెలిపారు. ఈ ఏడు మామిడి దిగుబడి తక్కువ ఉన్నందున బేనిషా, ఇమామ్‌పసంద్, సువర్ణరేఖ తదితర మామిడికి మంచి డిమాండ్ ఉందని, ఆ కాయలకు కవర్లు కట్టాలని సూచించారు. అన్నమయ్య సహకార సంఘం నుంచి 350 టన్నులు విదేశాలకు ఎగుమతి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జనరల్ సెక్రటరీ సురేంద్రనాయుడు, రైతులు పాల్గొన్నారు.



మామిడికి కవర్లు కట్టిన అన్నమయ్య రైతు సహకార సంఘం నాయకులు